## జిల్లా వ్యాప్తంగా 6,53,130 మంది ఓటర్లు 1,286 పోలింగ్ స్టేషన్లు

కామారెడ్డి, ఫిబ్రవరి 11 : జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు 2025కు సంబంధించి 25 మండలాల్లో 6,53,130 మంది ఓటర్లను గుర్తించారు. ఇందులో పురుషులు 3,14,173 మంది, స్త్రీలు 3,38,941 మంది, ఇతరులు 16 మంది ఓటర్లు ఉన్నారు. 25 మండలాల పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాలో జిల్లాపరిషత్ అధికారులు ప్రకటించారు. జిల్లాలో మొత్తం 1,286 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

## పంటల పరిశీలన

పంటలను పరిశీలిస్తున్న జిల్లా అధికారి

మాచారెడ్డి, ఫిబ్రవరి 11 : మండలంలోని ఎల్లంపేట గ్రామంలో వరి పంటను జిల్లా వ్యవసాయశాఖ అధికారి తిరుమల ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు వాడొద్దని సూచించారు. అనంతరం డిజిటల్ క్రాప్ సర్వేలో పాల్గొని రైతువేదికలో రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఈవోలు, రైతులు ఉన్నారు.

## వాహనాల తనిఖీ

బాన్సువాడలోని అంబేద్కర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 11 : బాన్సువాడలోని అంబేద్కర్, తాడ్కోల్ చౌరస్తాల్లో సీఐ అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీని చేపట్టారు. పెండింగ్ చలాన్లు, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి, నంబర్ ప్లేట్ లేని వాహనాలకు జరిమానా వేశారు. వాహనదారులు తప్పని సరిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. పెండింగ్ చలాన్ల బకాయిలు చెల్లించాలని, మద్యం తాగి వాహనాలు నడుపరాదని వాహనదారులకు సూచించారు. వాహనాల తనిఖీలో ఎస్సై అశోక్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

## మొబైల్ ఫోన్ అందజేత

రాజంపేట్, ఫిబ్రవరి 11 : మండల కేంద్రానికి చెందిన గుర్రాల రమేశ్ 2023లో తన మొబైల్ ఫోను పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి మొబైల్ ఫోను బాధితుడికి అందజేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. మొబైల్ ఫోన్ కోసం కృషి చేసిన కానిస్టేబుల్ రవీందర్, చిరంజీవిని ఎస్సై అభినందించారు.

# కేసీఆర్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలి

**చిట్‌చాట్ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ జుబేర్**

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 11 : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను ఈ నెల 17న ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు షేక్ జుబేర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ ఆదేశాల మేరకు పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో చిట్‌చాట్ సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను పండుగలా నిర్వహించాలని అన్నారు. రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మోచి గణేశ్, సాయిబాబాబా, సద్దాం, మహేశ్, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల చిట్ చాట్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జుబేర్

## పండిట్ దీన్ దయాళ్‌కు ఘన నివాళి

పండిట్ దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కామారెడ్డి, ఫిబ్రవరి 11 : జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్లు ప్రవీణ్, నరేందర్, నాయకులు సురేశ్, మోహన్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ మంత్రిని నియమించాలి

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్

కామారెడ్డి, ఫిబ్రవరి 11 : జిల్లా కేంద్రంలోని స్థానిక పీజేఆర్ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా 5వ మహాసభలను మంగళవారం నిర్వహించారు. ముందుగా జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్ ఎస్ఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి విద్యాశాఖకు మంత్రి లేడని, వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యారంగాన్ని మొత్తం నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిపులు రూ.8 వేల కోట్లకు పైగా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందన్నారు. విడుదల చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నదని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. కామారెడ్డిని ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చాలని కోరారు. కార్యక్రమంలో పూర్వ ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, నరసింహులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, కార్యదర్శి అజయ్, నాయకులు రాహుల్, నితిన్, మణికంఠ, నవీన్, విలాస్, ప్రశాంత్, సాయిగౌడ్, శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు అనుగుణంగా ఎన్నికల నిర్వహణ

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

కామారెడ్డి, ఫిబ్రవరి 11 : జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం ఎల్లారెడ్డి, మధ్యాహ్నం బాన్సువాడ రిటర్నింగ్ అధికారులు. సహాయ రిటర్నింగ్ అధికారులకు పంచాయతీ ఎన్నికల మొదటి దశ నిర్వహణ తీరు తెన్నులపై అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చట్టబద్ధతతో కూడిన ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నియమ నిబంధనల మేరకు స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించడం సాధ్యమవుతుందని చెప్పారు. శిక్షణ తరగతుల్లో వివరించిన ప్రతి అంశాన్ని శ్రద్ధగా విని అర్థం చేసుకోవాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకొని నామినేషన్ల స్వీకరణ, స్క్రూటీనీ, ఉపసంహరణ ప్రక్రియలను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుగుణంగా రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, డీఈవో రాజు, మాస్టర్ ట్రైనర్స్ నాగరాజు, సురేందర్, శ్రీనివాస్, ఆర్‌వోలు, సహాయ ఆర్‌వోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## కారు బోల్తా ఒకరికి గాయాలు

నస్రుల్లాబాద్ అటవీ ప్రాంతంలో బోల్తా పడిన కారు

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 11 : నస్రుల్లాబాద్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో బోధన్-బాన్సువాడ ప్రధాన రహదారిపై మంగళవారం కారు బోల్తా పడింది. బాన్సువాడ పట్టణానికి చెందిన కీర్తి వెంకటేశ్ పని నిమిత్తం నిజామాబాద్ నగరానికి అతి వేగంగా వెళ్తున్న క్రమంలో నస్రుల్లాబాద్ అటవీ ప్రాంతంలో బోల్తా పడింది. వెంకటేశ్‌కు గాయాలు కాగా ఆయనను బాన్సువాడ దవాఖానకు తరలించారు.

## ఆర్థికసాయం అందజేత

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న సితాలే రమేశ్

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 11 : బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన సితాలే రమేశ్ మంగళవారం జూకంటి మల్లేశ్‌కు ఆర్థికసాయం అందజేశారు. బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన జూకంటి మల్లేశ్ కుమారుడు కొంత కాలంగా అనారోగ్యానికి గురి కాగా అతడి కుటుంబ సభ్యులు ఆర్థికసాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ విషయాన్ని సితాలే రమేశ్ వాట్సాప్ స్టేటస్ పెట్టుకోగా రూ.28,663 ఫోన్ పే ద్వారా వచ్చాయి. ఆ నగదును జూకంటి మల్లేశ్‌కు అందజేశారు.

## 'ఆలయ అర్చకుడిపై దాడిని ఖండిస్తున్నాం'

కామారెడ్డి, ఫిబ్రవరి 11 : రామరాజ్యం ముసుగులో చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చిలుకూరి బాలాజీ ఆలయ అభివృద్ధికి రంగరాజన్ ఎంతో కృషి చేశారని అన్నారు. ఆయనపై దాడి చేసిన వ్యక్తులను పట్టుకొని చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నరసింహులు, కమిటీ సభ్యులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ హెల్త్ కార్డు వివరాలు నమోదు చేసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 11: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులో వివరాలను నమోదు చేయించుకోవాలని లింగారెడ్డిపేట్ పల్లె దవాఖాన వైద్యుడు శివకృష్ణ సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగారెడ్డిపేట్ పల్లెదవాఖానలో ఆయన ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డు వివరాలను నమోదు చేశారు. దవాఖానా పరిధిలోని లింగారెడ్డిపేట్, కళ్యాణి, సప్లల్‌పూర్, దేవునిపల్లి, దావల్‌మల్కపల్లి, రేపల్లెవాడ తదితర గ్రామాలకు చెందిన ప్రజలు హెల్త్ కార్డులో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

## భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలి

కరాటేలో సాధించిన పతకాలు చూపిస్తున్న కాటేపల్లి పాఠశాల విద్యార్థులు

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 11: మండలంలోని కాటేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో పాల్గొని బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారని ఎంఈవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. కరాటే కోచ్ శివప్రసాద్, విద్యార్థులను ఎంఈవో, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదవ్, శంకర్, లలిత, సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 11: హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మార్చి 2న నిర్వహించనున్న యుద్ధభేరి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీఎస్‌పీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు గులాం షాకీర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని జడ్పీ హెచ్ఎస్ (బాలికల)లో నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశంలో భాగంగా యూపీఎస్‌పై యుద్ధభేరి గోడప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. గోడప్రతుల ఆవిష్కరణలో డివిజన్ బాధ్యులు అనిల్‌కుమార్, వేణుగోపాల్, విశ్వనాథం, శివకుమార్, దుర్గయ్య, జ్ఞానేశ్వర్, సంగ్యా, మల్లిబాబు పాల్గొన్నారు.

## ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తే.. విజయం తథ్యం

రామారెడ్డి, ఫిబ్రవరి11: పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాస్తే విజయం తప్పకుండా వరిస్తుందని మానసిక వైద్యుడు డాక్టర్ రమణ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా, వైద్య ఆరోగ్య శాఖల సమన్వయంతో మానసిక ఆరోగ్యంపై ప్రతి కళాశాల, పాఠశాలలో ఆరోగ్యం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేశ్, సోషల్ వర్కర్ డాక్టర్ వంగ రాహుల్ కుమార్, హెచ్ఈ భీమ్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ వెళ్లిన గురుకుల విద్యార్థులు

రామారెడ్డి, ఫిబ్రవరి11: మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల విద్యార్థులు మంగళవారం పీఎం శ్రీ ప్రోగ్రామ్‌లో భాగంగా 8,9,10వ తరగతుల విద్యార్థులు సుమారు 108 మంది హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియానికి వెళ్లారు. వారితో పాటు సంబంధిత ఉపాధ్యాయులు వెళ్లినట్లు ప్రిన్సిపాల్ శివరాం తెలిపారు.

# వందశాతం పన్నుల వసూలు లక్ష్యం

- పన్నుల వసూలుకు ప్రజలు సహకరించాలి
- మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 11: వందశాతం పన్నులను వసూలు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, సిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్నుల వసూలుకు కార్యాచరణ ప్రణాళికను ఏర్పాటుచేసి కచ్చితంగా వందశాతం ఇంటి, కుళాయి, వృత్తి, వ్యాపార పన్నులు వసూలు చేయాలన్నారు. దీనికోసం నలుగురు సభ్యులతో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మార్చి నెల వరకు పట్టణంలో పూర్తి స్థాయిలో పన్నుల బకాయిలను వసూలు చేయాలని, దీనికి పట్టణ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 11: ఇంటి పన్నులు చెల్లించడంలో ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డి పట్టణంలో ఆయన సిబ్బందితో కలిసి ఇంటి పన్నుల బకాయిలు వసూలు చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 5 లక్షల 2 వేల 431 రూపాయల బకాయిలను వసూలు చేశారు. పట్టణ ప్రముఖ వ్యాపారి వంగపల్లి నాగభూషణం గుప్తా 4 లక్షల 41వేల రూపాయల పన్ను బకాయిని కట్టడంతో మున్సిపల్ కమిషనర్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఆయనతో పాటు వార్డు ఆఫీసర్, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 11: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈవో రామస్వామి సూచించారు. తాడ్వాయి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించి ఆయన మాట్లాడారు. కలాం ఇనిస్టిట్యూట్ సహకారంతో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన వల్ల విద్యార్థులో ఆలోచనాశక్తి పెరుగుతుందన్నారు. డీఆర్డీవో, ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించిన మిస్సైల్, బ్రహ్మోస్, మంగళయాన్, ఆర్యభట్టతోపాటు ఆర్మీ, నేవీకి ఉపయోగపడే మిస్సైల్స్ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గురుకుల పాఠశాల విద్యార్థులు సందర్శించారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు నర్సింహులు, మాజీ సర్పంచ్ సంజీవులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్యాంరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

. తాడ్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎంఈవో

## అథ్లెటిక్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

రామారెడ్డి (సదాశివనగర్) ఫిబ్రవరి 11: సదాశివనగర్ మండలం మర్కల్ మల్లన్న గుట్ట వద్ద ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఇటీవల కామారెడ్డిలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు(సెలక్షన్స్) నిర్వహించగా, అందులో విద్యార్థులు మొత్తం 8 బంగారు పతకాలు సాధించారు. దివ్య 400 మీటర్ రన్నింగ్, ఆర్ సంధ్య లాంగ్ జంప్, అమృత జావెలింగ్ త్రో, ఇందుమతి షాట్‌పూట్, ఎం. గాయత్రి లాంగ్ జంప్ అండర్-20 విభాగంలో పతకాలు సాధించారు. కె. దివ్య 400 మీటర్ల రన్నింగ్ అండర్-20. పి.శ్రీ విద్య డిస్కస్ త్రో, జె. కీర్తన డిస్కస్‌త్రో అండర్- 18 విభాగం, 400 మీటర్ల రన్నింగ్‌తో పతకాలు సాధించారు. వీరితో పాటు మరో ఐదుగురు విద్యార్థులు 5 వెండి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి మంగళవారం తెలిపారు. వీరిని అధ్యాపకబృందం అభినందించింది.

అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు

## మోడల్‌స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 11: క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో ఉత్తమ విద్య నందిస్తున్న మోడల్‌స్కూల్‌లో చేరాలని ప్రిన్సిపాల్ గాంధీ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి మండలంలోని వెల్లుట్ల, వెల్లుట్లపేట్, అన్నాసాగర్, తిమ్మారెడ్డి, తిమ్మారెడ్డి తండా, కళ్యాణి, లింగారెడ్డిపేట్ తండాకు చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. మోడల్‌స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 13 వరకు సమయం ఉన్నందున, ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆయనవెంట మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులు శివకుమార్, ప్రదీప్ ఉన్నారు.

## పీహెచ్‌సీలో 'అమ్మ ఒడి'

లింగంపేట, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు రక్త పరీక్షలు నిర్వహించి, రక్త హీనతతో బాధపడుతున్న వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి

కెనరా బ్యాంక్ వద్ద ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహేందర్

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 11: బ్యాంక్, ఏటీఎంలో డబ్బులు డ్రా చేసుకొని వెళ్తున్న సమయంలో చుట్టుపక్కల ఎవరైనా అనుమానితులుంటే జాగ్రత్తగా ఉండాలని స్థానిక ఎస్సై మహేందర్ సూచించారు. మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ వద్ద మంగళవారం ఖాతాదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి, తాము బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, మీ ఏటీఎం, మొబైల్ నంబర్, ఓటీపీ చెప్పాలని వివరాలు అడిగితే ఇవ్వవద్దని సూచించారు. అనుమానం ఉంటే బ్యాంకు మేనేజర్‌ను కలవడం గాని, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రామారెడ్డి (సదాశివనగర్), ఫిబ్రవరి 11: సదాశివనగర్ మండల కేంద్రంలో మంగళవారం వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానిక ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం 4 గంటలకు బుడిగే నర్సారెడ్డి వ్యవసాయ బావిలో 20 నుంచి 30 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న యువకుడి మృతుదేహం లభ్యమైంది. ఘటనా స్థలం నుంచి పోలీసులు మృతదేహాన్ని కామారెడ్డి ఏరియా దవాఖాన మార్చురీకి తరలించారు. ఎవరైనా ఆచూకీ కోసం 8712686164 నంబరును సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

## టిప్పర్ ఢీ : వ్యక్తి మృతి

మైశయ్య (ఫైల్)

లింగంపేట(తాడ్వాయి), ఫిబ్రవరి 11: తాడ్వాయి మండల కేంద్రంలో మంగళవారం టిప్పర్ ఢీకొనడంతో కీసరి మైశయ్య (55) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. తాడ్వాయి పాత బస్టాండ్ వైపు నడుచుకుంటూ వెళ్తున్న మైశయ్య ను మొరం లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీ కొనడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మైశయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## మాజీ వార్డు సభ్యుడి మృతి

మంగలి శంకర్ (ఫైల్)

ఎల్లారెడ్డి రూరల్/నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 11: కుంభమేళాకు వెళ్లిన ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన మంగలి శంకర్(45) కుంభమేళాలో స్నానం చేయడానికి ప్రయాగ్‌రాజ్ వెళ్లాడు. అక్కడ అస్వస్థతకు గురైన శంకర్‌ను లక్నో దవాఖానలో చేర్పించారు. అనంతరం అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. గతంలో ఎల్లారెడ్డి గ్రామపంచాయతీ వార్డు సభ్యుడిగా శంకర్ పని చేశాడు. దీంతో పట్టణంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

అక్రమంగా రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

బిచ్కుంద, ఫిబ్రవరి 11 : మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్ల ను పట్టుకున్నట్లు ఏఎస్సై యూసుఫ్ మంగళవారం తెలిపారు. మండలంలోని హస్గుల్ గ్రామ మంజీరా పరీవాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్లను పట్టుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## వాహనాలకు ధ్రువ పత్రాలు తప్పనిసరి

బిచ్కుంద, ఫిబ్రవరి 11 : వాహనదారులు తప్పని సరిగా ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని అసిస్టెంట్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కవిత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పోలీసులు, రవాణా శాఖ ఆధ్వర్యంలో వాహనాల ధ్రువ పత్రాలను పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో భారీ జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం సరైన పత్రాలు లేని మూడు ఇసుక ట్రాక్టర్లతో పాటు 10 వాహనాలను సీజ్ చేశారు.